
సాక్షి రంగారెడ్డి

శుక్రవారం : 31 : మే : 2024



రైతుల ఎదురుచూపు

వర్షాకాలానికి సమయం దగ్గర పడుతోంది. రైతులు పెట్టుబడి కోసం నిరీక్షిస్తున్నారు. సాయానికి ఎదురుచూస్తున్నారు. 8లో▸



పాల ప్యాకెట్ కోసం వెళ్లి..

పాల ప్యాకెట్ కోసం కుమారుడితో బైక్‌పై వెళ్లిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు విడిచాడు. 8లో▸



ఫిరంగి వాగు కబ్జా

రావిరాల్య రెవెన్యూ పరిధిలోని ఫిరంగి వాగును కొందరు రియల్టర్లు కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారు . 8లో▸

న్యూస్‌రీల్

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తాం

జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు



అమ్మ ఆదర్శ పాఠశాలలో మరమ్మతు పనులను పరిశీలిస్తున్న డీఈఓ

యాచారం: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించి, విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తామని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల తనిఖీలో భాగంగా గురువారం మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడ, మాల్ మార్కెట్‌లో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ప్రభుత్వ పాఠశాలను ఆదర్శంగా అభివృద్ధి చేసి, పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యేల్లోపు సౌకర్యాలు కల్పిస్తామని, విద్యార్థులకు యూనిఫాం అందజేస్తామని చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాలలకు మంజూరైన నిధులతో అవసరమైన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు జగనాథ్, శ్రీలత తదితరులు ఉన్నారు.

అనుమతించిన డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

శంకర్‌పల్లి: ప్రభుత్వం గుర్తించి, అనుమతించిన డీలర్ల వద్దనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి అన్నారు. శంకర్‌పల్లి పట్టణంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు అందిస్తున్న పచ్చిరొట్ట ఎరువుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయశాఖ తరఫున రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మే వారి గురించి తెలిస్తే వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు రమాదేవి, మండల వ్యవసాయాధికారి సురేష్‌బాబు, ఏఈవోలు రామకృష్ణారెడ్డి, రమ్య, షీలా, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలి



గడ్డమల్లయ్యగూడలో పండ్లతోటలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శ్రీలత

యాచారం: వర్షాలు కురిసిన వెంటనే మొక్కలు నాటేలా గుంతలు తీయడం పూర్తి చేయాలని డీఆర్‌డీఓ శ్రీలత సూచించారు. మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడలో గురువారం ఆమె పర్యటించారు. గ్రామంలో ఉన్న నర్సరీని, ఈజీఎస్ నిధుల ద్వారా గ్రామంలోని రైతులు పెంచుతున్న పండ్లతోటలను పరిశీలించారు. ఉపాధి పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు కురిసిన వెంటనే మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలపై చైతన్యం, అవగాహన కల్పించాలన్నారు. గతంలో ఈజీఎస్ నిధులతో పండ్లతోటలు పెంపకం చేపట్టిన రైతులు ప్రస్తుతం మంచి లాభాలు గడిస్తున్నారని గుర్తు చేశారు. ఉపాధి పనులు చేసిన కూలీలకు వెంటనే బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ సక్రియా, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, ఏపీఓ లింగయ్య తదితరులు ఉన్నారు.

నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

మాడ్గుల: నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డ సంఘటన మాడ్గుల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ విష్ణువర్ధన్ రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని కొత్త బ్రహ్మణపల్లిలో కొంతమంది నకిలీ పత్తి విత్తనాలు నిల్వ చేసి వ్యాపారం సాగిస్తున్నారు. పక్కా సమాచారంతో పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా దాడి చేశారు. ఓ ఇంట్లో నిల్వ ఉంచిన 80 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. నకిలీ విత్తనాల వ్యాపారం చేస్తున్న దుగ్గింపూడి మాల్రెడ్డి, అల్లం మాల్రెడ్డి, అల్లం వినోద్ రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ట్యాంక్‌బండ్‌పై ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాసరెడ్డి

సాంస్కృతిక సంరంభం

రాష్ట్ర అవతరణ ఉత్సవాలకు ముస్తాబవుతున్న నగరం

- తెలంగాణ అస్తిత్వం ప్రతిబింబించేలా ట్యాంక్‌బండ్ అలంకరణ
- వేలాది మంది కళాకారుల ప్రదర్శనకు రంగం సిద్ధం
- కళ్లకు కట్టేలా ఉద్యమ పోరాట ఘట్టాల ఆవిష్కరణ

సాక్షి, సిటీబ్యూరో: జై తెలంగాణ.. జై జై తెలంగాణ.. పిడికిలి బిగించి.. దిక్కులు పిక్కటిల్లేలా చేసిన ఈ నినాదం కోట్లాది గొంతుకలను ఏకం చేసింది. లక్షలాది మందిని పోరుబాటలో పరుగులు పెట్టించింది. వేలాదిమంది ఉద్యమ వీరుల త్యాగాలను ఎత్తిపట్టింది. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను పణంగా పెట్టి తెగించి కొట్లాడిన అమరుల కలను సాకారం చేసింది. యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించిన తెలంగాణ ఉద్యమం మూడున్నర కోట్ల ప్రజల ఆకాంక్షలను ఆవిష్కరిస్తూ ప్రత్యేక రాష్ట్రమై ఆవిర్భవించింది. ఇప్పుడు దశాబ్ది ఉత్సవాలకు సిద్ధమైంది. తెలంగాణ అస్తిత్వాన్ని, అమరుల త్యాగాలను సమున్నతంగా ప్రతిబింబించేలా పదేళ్ల వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం భారీ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా రాజధాని హైదరాబాద్ అందంగా ముస్తాబవుతోంది. నగరంలోని ప్రధాన కూడళ్లను, పర్యాటక ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న వేడుకలు కావడం, సోనియాగాంధీ ముఖ్య అతిథిగా హాజరు కానుండడంతో తెలంగాణ అస్తిత్వాన్ని ప్రతిబింబించేలా ప్రభుత్వం ఘనమైన ఏర్పాట్లు చేస్తోంది. నెక్లెస్ రోడ్డు, తెలుగుతల్లి ఫ్లైఓవర్, ఇందిరాగాంధీ కూడలి, పీపుల్స్ ప్లాజా, సంజీవయ్య పార్కు, సెక్రటేరియట్, తెలంగాణ అమరుల స్మారకం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, రాజ్‌భవన్ తదితర ప్రాంతాలను రంగరంగుల విద్యుద్దీపాలతో అలంకరించనున్నారు.

ఉత్సవాల వేదికగా ట్యాంక్‌బండ్

ట్యాంక్‌బండ్. ఉత్సవాల వేదిక. అంతేకాదు. ఆనాటి తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి కూడా అది కేంద్రబిందువు. వేలాదిగా తరలివచ్చిన ఉద్యమకారులతో మిలియన్ మార్చ్‌గా చరిత్రకెక్కింది. ఇప్పుడు దశాబ్ది ఉత్సవాలకు వేదికైంది. ట్యాంక్‌బండ్‌పై వేడుకలను కనుల పండువగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళారూపాలను ఈ సందర్భంగా ప్రదర్శించేందుకు సాంస్కృతిక శాఖ ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలోని జిల్లాలకు చెందిన కళాకారులను నగరానికి తరలించనున్నారు. ఇటు నెక్లెస్‌రోడ్డు నుంచి అటు ట్యాంక్‌బండ్ వరకు కళా ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. డప్పు కళాకారులు, ఒగ్గుడోలు, తప్పెట్లు, గుస్సాడి, కొమ్ముబూర, చిందు యక్షగానం, పేరిణి, సన్నాయి వాద్యాలు, పోతరాజులు, బతుకమ్మ, బోనాలు తదితర కళారూపాలను ప్రదర్శించనున్నారు. అన్ని జిల్లాలకు చెందిన సుమారు 5 వేల మంది కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొనే అవకాశం ఉన్నట్లు అంచనా.

ప్రత్యేకంగా తెలంగాణ స్మారకం

మరోవైపు తెలంగాణ ఉద్యమ ఘట్టాలను కళ్లకు కట్టే చిత్రాలతో తెలంగాణ అమరుల స్మారకాన్ని తీర్చిదిద్దనున్నారు. సందర్శకులకు ప్రత్యేక రాష్ట్ర ఆవిష్కరణ విశేషాలు, తెలంగాణ ప్రజల సామాజిక, ఆర్థిక పరిణామాలను చిత్రిక పట్టనున్నారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో పాల్గొని ప్రాణత్యాగం చేసిన అమరుల జీవిత విశేషాలపై ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు.

ఇదీ 'వరుస'

మొయినాబాద్: పచ్చిరొట్ట పైరు విత్తనాల కోసం రైతులు రెండోరోజు సైతం మొయినాబాద్ పీఏసీఎస్ కార్యాలయం వద్ద క్యూకట్టారు. గురువారం ఉదయం 6 గంటల నుంచి పీఏసీఎస్ కార్యాలయం ఎదుట చెప్పులు వరుసలో పెట్టారు. బుధవారం 220 బస్తాల జనుము విత్తనాలు పంపిణీ చేశారు. అవి రైతులకు సరిపోలేదు. గురువారం 293 బస్తాల జీలుగు విత్తనాలు రావడంతో వాటిని అందజేశారు. పీఏసీఎస్ కార్యాలయం వద్ద అధికారులు, సిబ్బంది రాకముందే రైతులు చెప్పులు వరుస పెట్టి విత్తనాల కోసం ఎదురుచూశారు. అధికారులు వచ్చిన వెంటనే రైతులందరికీ విత్తనాలను అందజేశారు. పచ్చిరొట్ట పైరు విత్తనాల కొరత లేదని.. మండల వ్యవసాయాధికారి రాగమ్మ తెలిపారు.



విత్తనాల కోసం వరుసలో ఉంచిన చెప్పులు

'పవర్'ఫుల్

- బ్రేక్‌డౌన్స్, ట్రిప్పింగ్స్ తగ్గుముఖం
- ఒత్తిడికి గురైన సబ్‌స్టేషన్లను గుర్తించాం
- పీటీఆర్‌ల సామర్థ్యం పెంచాం
- అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా
- 'సాక్షి'తో ఎస్పీడీసీఎల్ రంగారెడ్డి జోన్ సీజీఎం ఆనంద్



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ''గతంతో పోలిస్తే బ్రేక్‌డౌన్స్, ట్రిప్పింగ్స్ సంఖ్య భారీగా తగ్గుముఖం పట్టాయి. అంతేకాదు విద్యుత్ సరఫరాలో అంతరాయం కూడా భారీగా తగ్గింది. రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని సరఫరా వ్యవస్థను మెరుగుపరుస్తున్నాం. ఇప్పటికే ఒత్తిడికి గురవుతున్న సబ్‌స్టేషన్లను గుర్తించి, వాటిలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచాం. ఈదురుగాలితో కూడిన వర్షం వంటి విపత్తులను తట్టుకుని నిలబడేలా లైన్లను తీర్చిదిద్దాం. రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా సబ్‌స్టేషన్లను, వాటిలోని ఫీడర్లను, పంపిణీ వ్యవస్థను కంటికి రెప్పలా కాపాడుతున్నాం'' అని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ రంగారెడ్డి జోన్ సీజీ ఎం పెరుమాళ్ల ఆనంద్ తెలిపారు. ఈ మేరకు ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. విద్యుత్ సరఫరా వ్యవస్థ మెరుగు కోసం సరూర్‌నగర్, సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, వికారాబాద్ సర్కిళ్ల పరిధిలో చేపట్టిన చర్యలను వివరించారు.

ఫీడర్లపై ఒత్తిడి లేకుండా..

శివారు ప్రాంతాలు శర వేగంగా విస్తరిస్తున్నాయి. గృహ, వాణిజ్య కనెక్షన్లతో పాటు విద్యుత్ వినియోగం రెట్టింపైంది. సామర్థ్యానికి మించి డిమాండ్ నమోదవుతోంది. సబ్‌స్టేషన్లు ఒత్తిడికి గురై.. తరచూ ఫీడర్లు ట్రిప్పవుతున్నాయి. సరఫరాలో అంతరాయాలు తలెత్తుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిస్కం భావించింది. రూ.12.50 కోట్లు ఖర్చు చేసి కోకాపేట్, నార్సింగి, ఉప్మానగర్, ఇన్మల్‌నర్వ్, తుర్కయంజాల్, తట్టి అన్నారం, నందనవనం, వికారాబాద్ పట్టణం సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని 5 నుంచి 8 ఎంవీఏకు పెంచాం. గచ్చిబౌలి, జల్‌పల్లి, గండంగూడ, మదర్‌డెయిరీ సబ్‌స్టేషన్‌లోని పీటీఆర్‌ల సామర్థ్యాన్ని 8 నుంచి 12.5 ఎంవీఏకు పెంచాం. సబ్‌స్టేషన్లలోని ఫీడర్లపై ఒత్తిడి లేకుండా చూశాం. సాధ్యమైనంత మేరకు అంతరాయాలను నివారించి, సరఫరా మెరుగుపర్చాం.

ట్రిప్పింగ్స్ గణనీయంగా తగ్గాయి

గత ఏడాది జనవరి 23 నుంచి మే 23 మధ్య కాలంలో 33 కేవీ ఫీడర్ల పరిధిలో 77 బ్రేక్‌డౌన్స్ నమోదు కాగా, 145.18 గంటల పాటు సరఫరా నిలిచిపోయింది. ఈ ఏడాది ఇదే సమయంలో 56 బ్రేక్‌డౌన్స్ నమోదు కాగా, సరఫరాలో అంతరాయం కూడా 78.35 గంటలకు తగ్గిపోయింది. ఇక గత ఏడాది 1,086 ట్రిప్పింగ్స్ నమోదు కాగా, 328.20 గంటలు సరఫరా నిలిచిపోయింది. ఈ ఏడాది ట్రిప్పింగ్స్ సంఖ్య 790కి తగ్గిపోగా, సరఫరా నిలిచిపోయిన సమయం కూడా 187.45 గంటలకు తగ్గింది. ఇక 11 కేవీ ఫీడర్ల పరిధిలో గత ఏడాది ఇదే సమయానికి 552 బ్రేక్‌డౌన్స్ నమోదు కాగా, 764.37 గంటల సమయం సరఫరా నిలిచిపోయింది. ఈ ఏడాది బ్రేక్‌డౌన్స్ కొంత పెరిగినప్పటికీ.. కరెంట్ నిలిచిపోయిన సమయం చాలా తక్కువ. 11 కేవీ ఫీడర్ల ట్రిప్పింగ్స్ సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది. గత ఏడాది 9,334 ట్రిప్పింగ్స్ నమోదు కాగా, ఈసారి 7,330 మాత్రమే నమోదయ్యాయి.

డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా

నాలుగు సర్కిళ్ల పరిధిలో గత ఏడాది మార్చిలో గరిష్ట డిమాండ్ 1,309 మెగావాట్లు నమోదు కాగా, ఈ ఏడాది ఇదే సమయంలో 1,582 మెగావాట్లకు చేరుకుంది. గత ఏప్రిల్‌లో 1,395 మెగావాట్లు నమోదు కాగా, ఈ ఏప్రిల్‌లో 1,814 మెగావాట్లు నమోదైంది. ఇక గత మేలో 1,334 మెగావాట్లు నమోదు కాగా, ఈసారి ఏకంగా 1,698 మెగావాట్లకు చేరింది. జిల్లాలో గత ఏడాది మార్చిలో రోజు సగటు విద్యుత్ డిమాండ్ 27.84 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం కాగా, ఈ మార్చిలో 32.78 ఎంయూలకు చేరింది. గత ఏప్రిల్‌లో 28.55 ఎంయూలు కాగా, ఈసారి 35.22 ఎంయూలకు చేరింది. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను మెరుగుపర్చాం. రాజేంద్రనగర్, సరూర్‌నగర్ సర్కిళ్లతో పోలిస్తే అత్యధిక డిమాండ్ సైబర్‌సిటీలో నమోదవుతోంది.

కొరత లేదు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లాలో పత్తి, పచ్చిరొట్ట విత్తనాల కొరత లేదని కలెక్టర్ శశాంక స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో గురువారం వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గీతారెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం తరఫున రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రోస్ రైతుసేవా కేంద్రాల్లో రైతులకు అందజేస్తారని తెలిపారు. మేలు రకం పత్తి విత్తనాలు ప్రైవేటు డీలర్ల ద్వారా అందుబాటులో ఉంటాయన్నారు. జిల్లాలో 280 క్వింటాళ్ల జీలుగ, 1,498 క్వింటాళ్ల జనుముతో కలిపి మొత్తం 1,778 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. 1,584 క్వింటాళ్ల విత్తనాలు సరఫరా చేశామన్నారు. ఇంకా 194 క్వింటాళ్లు రైతులకు అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. పత్తి విత్తనాలు 4,91,036 ప్యాకెట్లు అవసరం ఉండగా 1,78,554 ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. నకిలీ విత్తనాల వదంతులు నమ్మొద్దని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం ముమ్మర తనిఖీలు చేస్తున్నట్టు చెప్పారు. కల్తీ విత్తనాలను నిరోధించడానికి టాస్క్‌ఫోర్స్ టీంలు వేసినట్టు వివరించారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

పదో తరగతి ఓ మైలురాయి



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న కలెక్టర్ శశాంక, చిత్రంలో ఇతర అధికారులు

కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి ఓ మైలురాయి వంటిదని, విద్యార్థులు సాధించిన విజయంలో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందని కలెక్టర్ శశాంక అన్నారు. పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు గురువారం కలెక్టరేట్‌లో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 50,807 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా, వీరిలో 46,245 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 36 ప్రభుత్వ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగిందని, 50 మంది విద్యార్థులు 10/10 గ్రేడ్ పాయింట్స్ సాధించారని చెప్పారు. విద్యార్థులు ఇక్కడి నుంచి ఏ స్థాయికి వెళ్తారనేది మీపైన, మీ ఆలోచన విధానంపై ఆధారపడి ఉంటుందన్నారు. గొప్పగా ఆలోచించాలని, గొప్పగా ఎదిగి, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రతిమా సింగ్, భూపాల్ రెడ్డి పాల్గొన్నారు. అంతకు ముందు కలెక్టర్ చేతుల మీదుగా పదో తరగతిలో 10/10 సాధించిన విద్యార్థులకు, 100 శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యాధికారులకు, సబ్జెక్టు రిసోర్స్ ఉపాధ్యాయులకు, కోఆర్డినేషన్ టీంకు పురస్కారాలు అందజేశారు.

కస్టోడియన్లతో కష్టమే!



సాక్షి, సిటీబ్యూరో: ఏటీఎం కేంద్రాల్లోని మెషీన్లలో నింపే పని చేసే ప్రైవేట్ సంస్థలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాయి. వీళ్ల పని చేసేది బ్యాంకుల కోసమే అయినా నగదు మాత్రం ప్రజల సొత్తే. ఈ విషయం మరిచి పని చేస్తున్న ఆయా ప్రైవేట్ సంస్థల నిర్వహణ లోపభూయిష్టంగా ఉండటం కేటుగాళ్లకు కలిసి వస్తోంది. గడిచిన కొన్నేళ్లలో కస్టోడియన్లుగా పిలిచే ఏటీఎం ఆఫీసర్లు కాజేసిన మొత్తం రూ.20.39 కోట్లకు పైగా ఉంది. ఎస్‌బీఐ తరఫున పని చేసే సెక్యూర్ వాల్యూ ఇండియా లిమిటెడ్‌లో పని చేసిన కస్టోడియన్ లక్ష్మణ్ రూ.3.5 కోట్లు కాజేశారు. దీనిపై మంగళవారం కేసు నమోదు చేసుకున్న హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పరారీలో ఉన్న నిందితుడు లక్ష్మణ్ కోసం గాలిస్తున్నారు.

నగదు నింపే బాధ్యత ప్రైవేట్ సంస్థలకే..

- ప్రభుత్వ రంగ, ప్రైవేట్ బ్యాంకులు తమ ఏటీఎంల్లో నగదును నింపే బాధ్యతల్ని ప్రైవేట్ సంస్థలకే అప్పగిస్తున్నాయి. ఇవి తమ వద్ద పని చేసే ఉద్యోగుల్లో అత్యధికశాతం కాంట్రాక్టు పద్ధతిలో నియమించుకుంటున్నాయి. భారీ మొత్తాలను తమ సంస్థల వాహనాల్లో తరలించే బృందానికి నేతృత్వం వహించే కస్టోడియన్లు కూడా కాంట్రాక్ట్ ఉద్యోగులే ఉంటున్నారు. ఏటీఎం మెషీన్ తెరిచే తాళాలు, పాస్‌వర్డులు కూడా వీరివద్దే ఉండడం గమనార్హం. మరమ్మతులు, ఇతర సందర్భాల్లో ఇబ్బందులు లేకుండా ఈ చర్యలు తీసుకుంటున్నామని ఆయా సంస్థలు చెబుతున్నాయి.
- ప్రాంతాల వారీగా ఉన్న ఏటీఎం కేంద్రాలను రూట్లుగా విభజించి, ఒక్కో రూట్‌కు ఒక కస్టోడియన్‌ను నియమిస్తున్నాయి. ఏ ఏటీఎం కేంద్రంలో ఎప్పుడు, ఎంత నింపారన్నది సాంకేతికంగా ఆయా సంస్థలు గుర్తించలేవు. ఏటీఎం మెషీన్, అది ఉన్న కేంద్రం బ్యాంకు అధీనంలో ఉండటమే దీనికి ప్రధాన కారణం. దీంతో కస్టోడియన్లు పని చేసే ఉద్యోగులు రికార్డుల్లో రాసిందే వారికి ఆధారం. ఈ తరహా ఉద్యోగుల కార్యకలాపాలపై అవసరమైన స్థాయిలో నిఘా ఉండట్లేదు. ఈ కారణంగానే లక్ష్మణ్ రూ.3.5 కోట్లు కాజేసే వరకు, ఆడిటింగ్‌కు భయపడి పారిపోయే వరకు ఆ విషయాన్ని ఎవరూ గుర్తించలేకపోవడమే దీనికి ఉదాహరణ.

తమకు అనుకూలంగా మార్చుకుని..

- ఏటీఎం కేంద్రాల్లో నగదు నింపిన కస్టోడియన్లు విధులు ముగించుకున్న తర్వాత మళ్లీ వెళ్లి ఏటీఎంలను తెరిచినా ఆ విషయం వాళ్ల పని చేసే సంస్థలకు తెలియదు. కొన్ని చోట్ల మాత్రమే దీన్ని కనిపెట్టే సాంకేతిక పరిజ్ఞానం ఉంది. ఇవన్నీ తమకు అనుకూలంగా మార్చుకుంటున్న కస్టోడియన్లు రికార్డులు పక్కాగా నిర్వహిస్తూ అందినకాడికి నగదు కాజేస్తున్నారు. ఆడిటింగ్‌లో ఈ విషయాన్ని ఆయా సంస్థలు గుర్తిస్తున్నా పోలీసులకు ఫిర్యాదు చేయడంలో ఆలస్యం చేస్తున్నాయి. సెక్యూర్ వాల్యూ సంస్థ విషయానికే వస్తే లక్ష్మణ్ రూ.3.54 కోట్లు కాజేసినట్లు ఈ నెల 23, 24 తేదీల్లోనే గుర్తించారు.
- ఇతడు ఎల్బీనగర్ ప్రాంతంలో ఉన్న 33 ఏటీఎం కేంద్రాలు ఉండే రూట్ నెం.79కి కస్టోడియన్‌గా ఉన్నాడు. ఆడిటర్ రాజేష్ వీటిని ఆ రెండు రోజుల్లో తనిఖీ చేసి 27 మెషీన్లతో రికార్డుల్లో పొందుపరిచిన దానికంటే తక్కువ మొత్తం ఉన్నట్లు సంస్థకు చెప్పారు. అయితే.. ఆ సంస్థ సీసీఎస్ పోలీసులకు 27వ తేదీ రాత్రి 8.15 గంటలకు ఫిర్యాదు చేసింది. ఆయా సంస్థలు అంతర్గత విచారణతో ఇలా జాప్యం చేయడం నిందితులు ఎక్కువ దూరం పారిపోవడానికి, నగదు ఖర్చు చేయడానికి అనువుగా మారుతోంది. ఫలితంగా నిందితులు దొరికినా రికవరీలు మాత్రం అతి తక్కువగా ఉంటున్నాయి. ప్రతి కేసును దర్యాప్తు చేసే పోలీసులు ఈ విషయం గుర్తించి ఆయా సంస్థలు, బ్యాంకులకు నివేదికలు ఇస్తున్నారు. అయినప్పటికీ వీటిని ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం.

అదృశ్యమైన వ్యక్తి అనుమానాస్పద మృతి


కృష్ణయ్య (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: అదృశ్యమైన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన గురువారం ఫరూఖ్‌నగర్ మండలం దూసకల్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దాసరి కృష్ణయ్య(50) తాగుడుకు బానిస అయ్యాడు. ఈ నెల 28న ఇంట్లో గొడవపడి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. ఆయన కోసం కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఈ నెల 29న కృష్ణయ్య కుటుంబ సభ్యులకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అదృశ్యం కేసు నమోదు చేశారు. దూసకల్ గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన విషయాన్ని పోలీసులు గుర్తించారు. అది దాసరి కృష్ణయ్యగా పోలీసులు నిర్ధారించారు. మృతుడి వద్ద పురుగుల మందు డబ్బా ఉండటంతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపడుతున్నట్లు ఏఎస్‌ఐ నర్సింహానాయక్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

నేరస్తుడిని కఠినంగా శిక్షించాలి

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండలంలోని కందివనం గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థిని మానస మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని యువసత్తా యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఎస్‌ఐ శరత్‌కుమార్‌కు ఆయన యూత్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థిని మానసను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని, ఈ వ్యవహారంలో నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థినికి మాయమాటలు చెప్పి వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో మానసను హత్య చేసి ఆత్మహత్యగా చేసుకున్నట్లు నమ్మించాడని అన్నారు. మానస మరణంపై పోలీసులు సమగ్ర విచారణ జరిపించి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరారు.


ఎస్‌ఐ శరత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మణ్‌కుమార్

ఖరీఫ్ సాయానికి రైతుల ఎదురుచూపు



ఎకరానికి రూ.15వేలు ఇస్తామన్న ప్రభుత్వం

- వానాకాలం ప్రారంభమైనా స్పష్టత కరువు
- అయోమయంలో కర్షక లోకం

షాబాద్: వర్షాకాలానికి సమయం దగ్గర పడుతోంది. నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయని భారత వాతావరణశాఖ గురువారం ధ్రువీకరించింది. పక్షం రోజుల్లో పంటల సాగుకు సంబంధించిన పనులు ప్రారంభం కానున్నాయి. ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్న అన్నదాతలు.. పెట్టుబడి కోసం నిరీక్షిస్తున్నారు. అయితే రైతు భరోసాపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో మార్గదర్శకాలు ఎలా ఉంటాయోనన్న ఆందోళన కర్షకుల్లో వ్యక్తమవుతోంది.

రైతుల ప్రోత్సాహానికి..

రైతులకు పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితిని తప్పించి వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం 2018లో రైతుబంధు పథకాన్ని అమలు చేసింది. ఈ పథకం కింద ఏటా రెండు పంటలకు కలిపి ఎకరాకు రూ.10వేల చొప్పున అందించారు. తాము అధికారంలోకి వస్తే ఈ సాయాన్ని రూ.15 వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. కానీ యాసంగి సీజన్‌లో పాత పద్ధతిలోనే ఎకరానికి రూ.5 వేల చొప్పున అందించారు. ఈ సీజన్ నుంచి సాయం పెంచుతామని అప్పట్లో ముఖ్యమంత్రి ప్రకటించారు. అయితే ఖరీఫ్ సాగు సమయం సమీపిస్తున్నప్పటికీ పెట్టుబడి సాయం విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో రైతుల్లో అయోమయం నెలకొంది.

విధివిధానాలు ఎప్పుడో?

నిధుల కొరత కారణంగా యాసంగికి సంబంధించిన పెట్టుబడి సాయాన్ని విడతల వారీగా పంపిణీ చేశారు. దీంతో రైతు భరోసాకు పరిమితులు విధిస్తారన్న ప్రచారం జరిగింది. అనర్హులకూ రైతు భరోసాను అందించడం ద్వారా ప్రజాధనం వృథా అయ్యిందని ప్రస్తుత పాలకులు భావిస్తున్నారు. రోడ్లు, గుట్టలు, సాగు యోగ్యంగా లేని భూములు, వెంచర్లుగా మారిన భూములకు పెట్టుబడి సాయం చెల్లించకూడదని నిర్ణయించినట్లు తెలుస్తోంది. అంతే కాకుండా రైతు భరోసాను ఐదెకరాలలోపు రైతులకు పరిమితం చేయాలని చూస్తున్నారని సమాచారం. అయితే ఈ అంశాలపై స్పష్టత లేదు. రైతుభరోసా అమలుకు సంబంధించిన విధివిధానాలపై ఎలాంటి ముందడుగు కనిపించలేదు. గతంలో జూన్‌లోనే ఖరీఫ్‌కు సంబంధించిన పెట్టుబడి సాయం జమ చేయడం ప్రారంభించేవారు. ప్రస్తుతం వానాకాలం పంటల సాగు కోసం పెట్టుబడులు సమకూర్చుకునే సమయం కావడంతో రైతులు మదన పడుతున్నారు.

ఎలాంటి ఉత్తర్వులు రాలేదు



రైతు భరోసా పథకానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. రైతుల వివరాలు సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి విధి విధానాలు రావాల్సి ఉంది. నిధులు విడుదల కాగానే అర్హుల ఖాతాలలో పెట్టుబడి సాయం జమ చేస్తాం. అందుకు తగ్గట్టు యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్నాం.

–గీతారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

సమస్యలపై రాజీలేని పోరాటం చేశాం

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పెండ్యాల బ్రహ్మయ్య


జెండావిష్కరణ చేస్తున్న బ్రహ్మయ్య

యాచారం: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలో జెండావిష్కరణ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పెండ్యాల బ్రహ్మయ్య ఆధ్వర్యంలో కార్మికులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెండావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్మిక సంఘం ఆవిర్భవించి నేటికి 54 వసంతంలోకి అడుగు పెట్టిందని, కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం చేసిన ఘనత సీఐటీయూకే దక్కిందని బ్రహ్మయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చందునాయక్, నాయకులు సోమయ్య, సత్యనారాయణ, రాములు, లింగమ్మ, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు


అబ్బాస్ అలీ (ఫైల్)

మహేశ్వరం: ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లిన వృద్ధుడు కనిపించకుండా పోయిన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. షాహీన్‌నగర్‌కు చెందిన మహ్మద్ అబ్బాస్ అలీ(74) ఈ నెల 27వ తేదీన సాయంత్రం ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లి, తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు సాధ్యమైన అన్ని ప్రాంతాలలో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ విషయమై అతని కుమారుడు ఇనాముల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62366 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

చేవెళ్ల: తమ వద్ద ఉన్న గంజాయిని చిన్న ప్యాకెట్లుగా చేసి గుట్టు చప్పుడు కాకుండా తెలిసిన వ్యక్తులకు అమ్ముతున్న ఇద్దరు వలస కూలీలను ఎస్‌ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏన్కేపల్లిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన సాహీర్ మియా, నూర్‌ఇస్లామ్‌లు మండలంలోని ఏన్కేపల్లి చౌరస్తాలో ఓ గదిని అద్దెకు తీసుకొని సెంట్రింగ్ కూలీలుగా పనులు చేస్తున్నారు. వీరు తమ వద్ద ఉన్న గంజాయిని చిన్ని చిన్న ప్యాకెట్లుగా చేసి శంకర్‌పల్లి మండలంలో తెలిసిన వ్యక్తులకు అమ్ముతున్నారు. పక్కా సమాచారంతో ఎస్‌ఓటీ పోలీసులు వారిని గుర్తించి పట్టుకున్నారు. వారి నుంచి 700ల గ్రాములు గంజాయికి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ. 28 వేల ఉంటుందని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా కేసులో ఏడుగురి బైండోవర్

ఆమనగల్లు: కడ్తాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ ముంతాజ్ ఎదుట ఏడుగురిని ఎక్సైజ్ పోలీసులు బైండోవర్ చేశారు. నాటుసారా కేసులలో అరెస్టు అయిన వారిలో కొందరిని బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ బద్యానాద్ చౌహాన్ తెలిపారు. దేపావత్ రమేశ్, రామావత్ రమేశ్, కేతావత్ బక్క, కేతావత్ మోతీ, ఇస్లావత్ వాల్యా, సిలివేరు చెన్నయ్య, సబావత్ చంద్రానాయక్‌లను బైండోవర్ చేశామని ఆయన వివరించారు. బైండోవర్ అయినవారు ఏడాదిలోపు మరోకేసులో ఉంటే రూ.1 లక్ష జరిమానా చెల్లించాల్సి ఉంటుందని సీఐ చెప్పారు.

పాల ప్యాకెట్ కోసం వెళ్లి..

కళ్లముందే తండ్రి విగతజీవిగా పడి ఉండటాన్ని ఆ పసి హృదయం తట్టుకోలేకపోయింది. ఉబికి వస్తున్న దుఃఖం..వచ్చీరాని మాటలతో నాన్నను.. లేపేందుకు ప్రయత్నిస్తూ గుండెలవిసేలా రోదించాడు. ఆ చిన్నారి గోసను చూసి స్థానికులు కళ్లు చెమర్చారు. ఈ విషాద సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కనకప్రసాద్, చిత్రంలో రోదిస్తున్న కుమారుడు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

- మృతదేహం వద్ద విలపించిన రెండేళ్ల కుమారుడు

అబ్దుల్లాపూర్‌మెట్: జీవనోపాధి కోసం సొంత ఊరును విడిచి నగరానికి వచ్చాడు. భార్యాపిల్లలతో జీవితం సాఫీగా సాగుతోందని భావించాడు. కానీ రోడ్డు ప్రమాదం అతని ఆశల్ని చిదిమేసింది. రెండేళ్ల కుమారుడితో కలిసి పాల ప్యాకెట్ కోసం బయటకు వెళ్లిన వ్యక్తిని అతి వేగంతో వచ్చిన వాహనం బలికొంది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు మండలం అత్తివాడులు గ్రామానికి చెందిన శెట్టి కనకప్రసాద్(35) తన భార్య పిల్లలతో కలిసి మండలంలోని ఇనాంగూడలో ఉంటూ ప్రైవేటు జాబ్ చేస్తున్నాడు. గురువారం ఉదయం 7 గంటలకు పాల ప్యాకెట్ కోసం తన ద్విచక్ర వాహనంపై రెండేళ్ల కుమారుడు శివకుమార్‌ను వెంట తీసుకుని అబ్దుల్లాపూర్‌మెట్ కూడలికి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఇనాంగూడ కూడలి వద్ద రోడ్డు దాటుతుండగా విజయవాడ వైపు నుంచి వస్తున్న ఓ డీసీఎం అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కనకప్రసాద్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందగా, అతని కుమారుడు శివకుమార్‌కు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెలవిసేలా రోదించిన బాలుడు

తనతో ముచ్చటిస్తూ వచ్చిన తన తండ్రి రోడ్డుపై విగతజీవిగా పడి ఉండడంతో.. ఏం జరిగిందో తెలియని చిన్నారి తండ్రి మృతదేహం పక్కనే కూర్చుని.. దిక్కులు చూస్తూ గుక్క పెట్టి ఏడ్చాడు. ఇది చూసిన వారు కన్నీటి పర్యంతమయ్యారు. ఇంట్లోంచి బయటకు వెళ్లిన కొన్ని నిమిషాల్లోనే భర్త తనకు దూరమయ్యాడని సంఘటనా స్థలంలో మృతుడి భార్య గుండెలవిసేలా రోదించింది.

యథేచ్ఛగా ఫిరంగి వాగు కబ్జా

- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు


ఫిరంగి వాగులో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలు

తుక్కుగూడ: నగర శివారు ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలు రావడంతో రియల్టర్లు రెచ్చి పోతున్నారు. వాగులు, వంకలను సైతం వదలడం లేదు. యథేచ్ఛగా కబ్జాలు చేస్తూ వాటి స్వరూపాన్ని మార్చి వేస్తున్నారు. తమకి అనుకూలంగా నిర్మాణాలు చేపట్టి విక్రయించి కాసులు దండుకుంటున్నారు. దీంతో వర్షాలు కురిసిన సమయంలో వరద నీటి ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తి వ్యవసాయ పంటలు, రోడ్లు పూర్తిగా మునిగిపోతున్నాయి. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల రెవిన్యూ పరిధిలోని ఫిరంగి వాగును కొందరు రియల్టర్లు కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. రావిర్యాల పెద్ద చెరువు నుంచి ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాలకు వరద నీరు పోయే అతి పెద్ద వాగు ఇదే. గతంలో వాగు నుంచి వచ్చే నీటితో రైతులు పంటలను సాగు చేసే వారు. ప్రస్తుతం ఈ వాగు విస్తీర్ణాన్ని సగానికి పైగా అక్రమార్కులు కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు ఆదిబట్లకు పోయే ప్రధాన రహదారిలో కబ్జా చేస్తున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి వాగు భూమిని కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉపేక్షించేది లేదు

రావిర్యాల పెద్ద చెరువు నుంచి వరద నీరు పారే ఫిరంగి వాగులో నిర్మాణాలు జరుగు తున్న విషయంపై త్వరలోనే పరిశీలిస్తాం. వాగును కబ్జా చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు.

– బాలాజీ, ఏఈ ఇరిగేషన్, మహేశ్వరం

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


కుమార్ (ఫైల్)

నందిగామ: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని వీర్లపల్లిలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఘనపురం కుమార్(28) తాగుడుకు బానిసగా మారాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ ఘర్షణలు జరిగేవి. ఈ నేపథ్యంలో ఈ నెల 23న భార్యతో గొడవ పడి కుమార్ తన ఒంటికి నిప్పంటించుకున్నాడు. చికిత్స నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య రేవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భూ కబ్జాపై కేసు నమోదు

నందిగామ: ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపాల కృష్ణ గురువారం తెలిపారు. మండల పరిధిలోని రంగాపూర్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన సల్వేంద్రిగూడ గ్రామానికి ఆనుకొని సర్వే నంబరు 499 లోని ఇనాం భూమిలో సుమారు 10 గుంటల భూమిని అదే గ్రామానికి చెందిన మల్లెల అనిత కబ్జా చేసి ఫ్రీకాస్ట్ ఏర్పాటు చేశారు. విషయం తెలిసిన రెవెన్యూ అధికారులు ఫ్రీ కాస్ట్‌ను ఇటీవల తొలగించారు. ఇనాం భూమిని కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్ఐ రోజా ఇచ్చి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పని ప్రదేశంలో ఉపాధి కూలీకి గాయం


కాలికి అయిన గాయం

యాచారం: మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన పంబలి సత్తయ్య అదే గ్రామంలో గురువారం ఉపాధి పనులకు వెళ్లాడు. పనులు చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు రాయి సత్తయ్య కాలు మీదపడటంతో తీవ్ర గాయమైంది. తోటి కూలీలు వెంటనే గ్రామంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య.. సత్తయ్యను పరామర్శించారు. సత్తయ్యకు ఆరోగ్యం కుదుట పడేవరకు ఈజీఎస్ నిధుల నుంచి నిత్యం కూలీ చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

గుళికల మందు తిని యువకుడి బలవన్మరణం


రమేష్‌యాదవ్ (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: గుళికల మందు తిని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో చోటుచేసుకుంది. ఏఎస్ రాంచందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బద్దుల రమేష్ యాదవ్(25) గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. ఈనెల 26న రాత్రి తీవ్రంగా కడుపునొప్పి రావడంతో భరించలేని రమేష్‌యాదవ్ ఇంట్లో గుళికల మందు తిని అపస్మారక స్థితిలో చేరుకున్నారు. విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ని చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ రమేష్‌యాదవ్ ఈనెల 29న రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.